# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 27 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హైడ్రా పేరుతో బెదిరింపులు

- ఇద్దరిపై కేసు నమోదు
- హైడ్రా పేరుతో బెదిరిస్తే జైలు శిక్ష ఖాయం : హైడ్రా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైడ్రా పేరు చెప్పిబెదిరించిన ఇరువురిపై గచ్చిబౌలి పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. మిరియాల వేదాంతం, యెలిసెట్టి శోభన్ బాబు గండిపేట మండలం, నెక్నాంపూర్ విలేజ్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఓ ఇంటికి వెళ్లి బెదిరించినట్టు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఈ నెల 23న మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. నలుపు రంగు కారులో వచ్చిన ఈ ఇద్దరు ఇంటి ఆవరణలోకి వచ్చి పరిశీలిస్తుండగా.. ఎవరని అడిగితే తాము హైడ్రా నుంచి వచ్చామని బదులిచ్చారని ఆ ఇంటి వద్ద పని చేస్తున్న గుంతకల్ మల్లికార్జున్ తెలిపారు. ఎందుకు వచ్చారని అడిగితే ఈ ఇంటిని కూల్చేస్తామని.. ఇందుకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నామని చెప్పారన్నారు. ఇంటి యజమానితో మాట్లాడాలని సూచించగా.. చల్లగా జారకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మల్లికార్జున్ పేర్కొన్నారు. నిందితులు మిరియాల వేదాంతం కారు డ్రైవర్ కాగా.. కరీంనగర్ జిల్లాకు చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. అల్కాపురి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నాడు.

మిగితా 2వ పేజీలో

# బోనాలు ప్రారంభం





- తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలి
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- తొలి బోనం సమర్పించడం నా అదృష్టం : మంత్రి కొండా సురేఖ
- గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత : మంత్రి పొన్నం ప్రభాకర్
- గోల్కొండలో తొలి బోనం సమర్పించిన స్పీకర్, మంత్రులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల సంబరాలు గోల్కొండ కోటలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాఢ మాసంలో నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి బోనం జగదాంబిక అమ్మవారికి సమర్పించారు. కుతుబ్‌షాహీల కాలం నుండి కొనసాగుతున్న ఈ సంప్రదాయంలో, భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు, చీరసారెలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా స్పీకర్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు తొలి బోనం ఎత్తుకొని పట్టువస్త్రాలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు.

అమ్మవారి ఆశీర్వాదాలు తెలంగాణపై ఉండాలనీ, రాష్ట్ర అన్ని రంగాల్లో ముందుకువెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శ్రీ జగదాంబ మహంకాళి గోల్కొండ బోనాల ఉత్సవాల సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గోల్కొండ జగదాంబ అమ్మవారి అనుగ్రహం మనపై ఉండాలనీ, కొన్నేండ్ల నుంచి జంట నగరాల్లో వైభవంగా బోనాల సాంప్రదాయం కొనసాగుతుందన్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారు చాలా మహిమగల తల్లి అని అన్నారు. జంట నగరాల్లో నిర్వహించే బోనాల నిర్వహణకు రూ. 20 కోట్లు సీఎం రేవంత్‌రెడ్డి ముందుగానే అందజేశారని గుర్తుచేశారు. జగదాంబ అమ్మవారి ఆశీస్సులు ప్రభుత్వంపై ఉండాలనీ, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో సంప్రదాయరీతిలో గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడం.. తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వం ఈ బోనాల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. నెలరోజుల పాటు జరిగే బోనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. బోనాలు, ఇతర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, ఆలయ కమిటీ చైర్మెన్ చిట్టిబాబు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత చరిత్ర ఉందన్నారు. జంట నగరాల్లో దారులన్నీ గోల్కొండ వైపే ఉన్నాయనీ, ప్రజలు భక్తులు తండోపతండాలుగా వస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అలాగే భక్తులు, ప్రజలకు పోలీసులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. రాష్ట్ర నలుమూలల నుంచి బోనాల పండుగ ప్రాముఖ్యతపట్ల మహానగరానికి ప్రజలు, భక్తులు తరలివస్తున్నారన్నారు. తెలంగాణ బోనాలు సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతం కంటే మెరుగ్గా అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. బోనాల నిర్వహణకు 20 కోట్లు ఇచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

మిగితా 2వ పేజీలో






## డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్'

- ఒక మొక్క గంజాయి మెలిచినా ఇట్టే కనిపెట్టే ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈఏజీఎల్ఏ)
- డ్రగ్స్ అక్రమార్కుల వెన్ను విరుద్దాం
- ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్ హబ్‌గా మారితే విఫలమైనట్టే
- విద్యాసంస్థల్లో డ్రగ్స్ కనిపిస్తే యాజమాన్యాలదే బాధ్యత
- సీఎం రేవంత్‌రెడ్డి
- శిల్పకళా వేదిక ప్రాంగణంలో డ్రగ్స్ నియంత్రణపై కార్యక్రమం

EAGLE
Elite Action Group
For Drug Law Enforcement

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఒకనాటి ఉద్యమాల గడ్డ తెలంగాణ మాదక ద్రవ్యాల మహమ్మారికి అడ్డాగా మారకూడదన్న లక్ష్యంతో ఇకనుంచి రాష్ట్రంలో ఒక మొక్క గంజాయి మెలిచినా ఇట్టే కనిపెట్టే "Elite Action Group For Drug Law Enforcement%" (Eagle) ను ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచంతో పోటీ పడే ఒక ఆరోగ్యకరమైన, మాదక ద్రవ్య రహిత తెలంగాణను నిర్మించుకోవడంలో ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం" పురస్కరించుకుని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, తెలంగాణ వికలాంగులు, సీనియర్ సిటిజన్లు మరియు లింగమార్పిడి వ్యక్తుల సాధికారత శాఖ సంయుక్తంగా శిల్పకళా వేదిక ప్రాంగణంలో డ్రగ్స్ నియంత్రణపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

"తెలంగాణలో ఒకనాడు ఉద్యమాలకు వేదికలైన కాలేజీలు, యూనివర్సిటీలు గంజాయి, మాదక ద్రవ్యాలకు వేదిక అయితే అది అందరికీ అవమానం. యువకులు డ్రగ్స్ బారిన పడి బలవుతున్నారు. డ్రగ్స్ నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. పాఠశాల, కాలేజీల్లో ఎక్కడైనా సరే దీనికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే తెలియజేయండి. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో విద్యార్థులను స్కూళ్లు, కాలేజీల్లో చేర్పిస్తుంటే, కేవలం చదువు చెబితే చాలన్నట్టు యాజమాన్యాలు, అధ్యాపకులు భావించడం సరికాదు. వాటిని నియంత్రించడంలో యాజమాన్యాలకు కూడా బాధ్యత ఉంటుంది.

కాలేజీల్లో డ్రగ్స్ ఆనవాళ్లు దొరికితే ఇక నుంచి వాటి యాజమాన్యాలపైన కూడా కేసులు నమోదు చేయండి. యాజమాన్యాలు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థుల నడవడికను కూడా గమనించాల్సి ఉంటుంది. డ్రగ్స్ నియంత్రణపై పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలతో నార్కోటిక్స్ బ్యూరో ఒక సమావేశం నిర్వహించాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో 68 శాతం యువత ఉంది. ఐటీతో సహా అన్ని రంగాల్లో దేశం ముందుకు వెళుతుంటే దెబ్బతీయడానికి, దేశాన్ని నిర్వీర్యం చేయడానికి ఇలాంటి డ్రగ్స్ మహమ్మారితో యువతను బలిగొనే కుట్రలు జరుగుతున్నాయి. దేశ రక్షణలో ముందు వరుసలో నిలుచున్న పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ భారిన పడి యువత నిర్వీర్యమైపోతోంది.

డ్రగ్స్‌తో ఎవరైనా తెలంగాణ కాలు పెట్టాలంటే వందసార్లు ఆలోచించాలి. ఒక గడ్డి పరకైనా రాష్ట్రంలో అడుగుపెట్టినా వెన్ను విరుస్తాం. ఐటీ హబ్‌గా, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ గంజాయికో, డ్రగ్స్ హబ్‌గా మారితే మనమంతా విఫలమైనట్టే. యువతను సరైన దిశగా నడిపించాల్సిన అవసరం ఉంది. యువతను సరైన దిశలో నడిపించాలన్న ఉద్దేశంతోనే క్రీడా పాలసీని తెచ్చాం. నైపుణ్యాలను మెరుగుపరచడానికి స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. రేపటి రోజున ఎవరైనా క్రీడల్లో శిక్షణ తీసుకోవాలంటే తెలంగాణ వెళ్లాలన్న పరిస్థితి రావాలి. తెలంగాణను ఒక స్పోర్ట్స్

మిగితా 2వ పేజీలో

### రూ.180.38 కోట్ల
## పెండింగ్ మెడికల్ బిల్లులు మంజూరు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉద్యోగులు, పెన్షనర్లకు పెద్ద ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం వారి పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను మంజూరు చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటన చేశారు. ఈ చర్య ద్వారా సుమారు రూ.180.38 కోట్ల బిల్లులు మంజూరయ్యాయి. దీని ద్వారా 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు.

గత రెండేళ్లుగా సచివాలయం, ఇతర కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఉద్యోగులకు ఈ పరిష్కారం లభించింది. మార్చి 4, 2023 నుంచి జూన్ 20, 2025 మధ్య పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసింది. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు, అదనపు డీఏ ప్రకటించిన తరువాత ఈ బిల్లుల చెల్లింపు జరగడం గమనార్హం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసమితి సిఫారసు మేరకు నిధులు విడుదలయ్యాయి. రైతు భరోసా కింద రైతుల ఖాతాలలో రూ.9,000 కోట్లు జమ చేసిన తరువాత ప్రభుత్వం ఈ బిల్లులకు నిధులు కేటాయించడం జరిగింది.

**ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం పట్ల కట్టుబాటు**

ప్రభుత్వానికి ఆర్థిక పరిమితులు ఉన్నా, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే ఈ నిధులు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. ఇటీవల ప్రకటించిన డీఏ పెంపుతో 3.5 లక్షల మంది ఉద్యోగులు, 3 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నట్టు, దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై వార్షికంగా రూ.2,400 కోట్ల అదనపు భారం పడనుందని వివరించారు. ఇంకా మహిళా, శిశు సంక్షేమ, ప్రణాళిక విభాగాల్లో ఉద్యోగుల సంఖ్య పెంపుకు ఆమోదం తెలిపింది. ఉద్యోగుల సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. గ్రామ పంచాయతీలను జనాభా ఆధారంగా నాలుగు

మిగితా 2వ పేజీలో

## తెగిన జూరాల 9వ గేట్ రోప్‌వే..

### నీటిని విడుదల చేసే క్రమంలో మొరాయించిన గేట్లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పొరుగు రాష్ట్రాలలో కురుస్తున్న కుంభవృష్టి వల్ల కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఈ జల ప్రవాహం జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు పోటెత్తడంతో.. జలాశయం నిండుకుండలా మారింది. నీటిని దిగువకు విడుదల చేసే క్రమంలో డ్యామ్ 9వ గేట్ రోప్ తెగిపోయిన ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో పాటు మరో రెండు రోప్స్ బలహీనపడటం స్థానిక ప్రజానీకంలో, ఆయకట్టు రైతులలో భయాందోళనలు సృష్టిస్తోంది.

ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో రుతుపవనాలు చురుగ్గా కదులుతూ కుండపోత వర్షాలను కురిపిస్తున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి అనుబంధంగా ఉన్న వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా.. తెలంగాణ రాష్ట్రంలో జూరాలకు అనూహ్యమైన స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో జలాశయం గరిష్ట నీటిమట్టానికి చేరువ కావడంతో, ఇంజనీర్లు వెంటనే అప్రమత్తమై నీటి మట్టాన్ని నియంత్రించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా.. ప్రాజెక్టుకు ఉన్న మొత్తం గేట్లలో 12 గేట్లను ఎత్తివేసి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు, శ్రీశైలం జలాశయం వైపు విడుదల చేస్తున్నారు. అయితే.. ఈ ప్రక్రియలో ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాజెక్టు గేట్లను పైకి లేపుతున్న సమయంలో.. 9వ నెంబర్ గేటుకు సంబంధించిన బలమైన ఉక్కు మోకులు ఒక్కసారిగా తెగిపోయాయి. ఈ పరిణామంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఉలిక్కిపడ్డారు.

మరోవైపు ఎగువన కర్నాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాలకు వరద ఉధృతి పెరుగుతోంది. కృష్ణా బేసిన్‌లో ఉన్న వాగుల్లో వరదతో నదీ ప్రవాహం పోటెత్తుతోంది. లక్ష క్యూసెక్కుల నీటి ప్రవాహం దాటడంతో వరద నియంత్రణ చర్యలు చేపట్టారు. 15 గేట్లు ఎత్తి శ్రీశైలంకు నీటిని వదలుతున్నారు. ప్రాజెక్టు గేట్లు పైకి లేపుతున్న సమయంలో 9,12,16,19వ గేట్లు మొరాయించాయి. ఈ నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ( ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభంలో రోప్‌లను సరిచూడటం, గ్రీసింగ్ చేయడం, గేట్ రోప్‌వే బలాన్ని పరీక్షించడం, అవసరమైతే మార్చడం వంటి పనులు చేయాల్సింది. గేట్లు పూర్తిగా పనిచేయకపోయినా.. అదుపు తప్పినా.. నీటి విడుదలలో సమస్య ఏర్పడుతుంది. దీంతో దిగువ సమీప ప్రాంతాలు జలమయం అవుతాయి. కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. గుబ్బంగడ్డతో పాటు పెబ్బేరు, బ్రిడ్జి రంగాపూర్ సోమశీల, మంచాలకట్ట తదితర గ్రామాలు నీటమునిగే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వంలోనూ శాశ్వత చర్యలు తీసుకోలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి ఉంది.

**జూరాలకు ముప్పేమీ లేదు : జూబేర్, ఈఈ- జూరాల ప్రాజెక్టు**

వరదలు వచ్చే సమయంలో ప్రతి ఏడాదీ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేస్తూ ఉంటాం. అందులో భాగంగా చిన్నచిన్న మరమ్మతులు వచ్చాయి. ప్రాజెక్టుకు సంబంధించిన భద్రత విషయంలో ఎవరికి ఎలాంటి అపోహలూ ఉండరాదు. ఎన్ని క్యూసెక్కుల నీరు వచ్చినా తట్టుకునే శక్తి ప్రాజెక్టుకు ఉంది' అని జూరాల ప్రాజెక్టు ఈఈ జూబేర్ తెలిపారు.


### కాంగ్రెస్ నిర్లక్ష్యానికి నిదర్శనం జూరాల ప్రమాదం

- ఏటా వరద వస్తుందని తెలిసినా పనులు చేపట్టలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో

## హైదరాబాద్‌లో దంపతుల 'నగ్న' దందా

- డబ్బు కోసం ఆన్‌లైన్‌లో నగ్న వీడియోల విక్రయం.. జంట అరెస్ట్!
- నిందితుల నుంచి కెమెరా, లైవ్ లింక్ పరికరాలు స్వాధీనం.



**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆన్‌లైన్ వేదికగా సొంత నగ్న వీడియోలను చిత్రీకరించి, వాటిని విక్రయిస్తున్న ఓ జంటను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సమాజంలో నైతిక విలువలకు తూట్లు పొడుస్తూ సాగుతున్న ఈ అశ్లీల దందా స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే... అంబర్‌పేటకు చెందిన దంపతులు కొంతకాలంగా ఆన్‌లైన్‌లో తమ నగ్న వీడియోలను స్ట్రీమింగ్ చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. డబ్బులు చెల్లించిన వారికి ప్రత్యేకంగా స్ట్రీమింగ్ లింకులను, వీడియోలను పంపుతున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్ధారించుకున్నారు.

మిగితా 2వ పేజీలో

### ఆర్టీఏ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై
## ఏసీబీ ఆకస్మిక దాడులు

### రాష్ట్రవ్యాప్తంగా 18 చోట్ల దాడులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలోని ఆర్టీఓ కార్యాలయాలు, సరిహ ద్దుల్లోని చెకోపోస్టులపై ఏసీబీ అధికారులు ఏక కాలంలో దాడులు చేశారు. హైదరాబాద్ నగర పరిధిలోని ఉప్పల్, తిరుమలగిరి, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాలోని రోడ్డు రవాణా శాఖ కార్యాలయాలను కలుపుకుని ఏకంగా 18 ఆఫీసులపై ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ అధి కారుల దాడులు కొనసాగుతున్నాయి ఇందులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొం టున్న అధికారులు.. వారికి తొత్తులుగా మారిన ఆర్టీఓ ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఉప్పల్,తి రుమలగిరి ఆర్టీఓ కార్యాలయాలపై ఏసీబీ అధికారుల మెరుపు దాడులు చేశారు.

ఏకంగా కార్యాలయం గేట్ మూసివేసి తిరుమలగిరిలో 10, ఉప్పల్లో మరో 10 మంది ఆర్టీఓ ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఈ పరి ణామంతో ఆర్టీఓ కార్యాలయం పరిధిలో అప్పటి వరకూ గుమిగూడిన ఏజెంట్లు అంతా.. అక్కడి నుంచి పరారయ్యారని తెలిసింది.

## పీజీఈసెట్ ఫలితాలు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ పీజీఈసెట్-25 ఫలితాల్లో అమ్మాయిల హవా కొనసాగింది. ఇటీవలే తుది కీ ని విడుదల చేసిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి తాజాగా ఫలితాలు ప్రకటించింది. మహిళలు 93.49%, పురుషులు 91.61% మంది క్వాలిఫై అయ్యారు. 12,511 మంది మహిళలకు 11,697 మంది, 10,472 మంది పురుషులకు 9,593 మంది ఉత్తీర్ణత సాధించారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ pgecet.ac.in, లేదా results.tsche.ac.in ద్వారా తమ వ్యక్తిగత స్కోర్, ర్యాంకులను తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్‌చేస్తే ర్యాంక్ కార్డు పొందవచ్చని వెల్లడించారు.

# బంగాళఖాతంలో అల్పపీడనం

బలగం టీవి, హైదరాబాద్

ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ ఆవర్తనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని చత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. వాయువ్య అరేబియన్ సముద్ర తీర ప్రాంతం నుంచి ఒక ద్రోణి దక్షిణ గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్రమట్టం 1.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఏర్పడిందని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకశం ఉందని తెలిపింది. శుక్రవారం రాష్ట్రంలో ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మాల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల మేర ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని ఎల్లో హెచ్చరికలు జారీ ఇచ్చింది.

# బోనాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

బజగదాంబిక మహంకాళి, ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు కల్వకుంట్ల కవిత.అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్ధిస్తున్నట్లుగా కవిత తెలిపారు. తెలంగాణ కుమ్మరి సంఘాలు తయారు చేసిన మట్టి కుండలో గోల్కొండపై వెలసిన ఎల్లమ్మతల్లికి బోనం నైవేద్యంగా తయారు చేసి తెచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి కవితకు హారతిచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ముందుగా కవిత బోనం తలపై పెట్టుకొని కాలి నడక ద్వారానే బజగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అటుపై ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు, క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

# హైడ్రా పేరుతో బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

మరో వ్యక్తి యెలిసెట్టి శోభన్‌బాబు ఆర్టీసీలో పని చేసి రిటైర్ అయ్యారు. ఈయన మణికొండలోని పుప్పాలగూడ, ఎస్టీమ్ రెసిడెన్సీలో నివాసం ఉంటున్నాడు. ఆ ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**హైడ్రా పేరుతో బెదిరిస్తే జైలు శిక్ష ఖాయం**

హైడ్రా పేరు చెప్పి ఎవరైనా మోసాలకు, బెదిరింపులకు పాల్పడితే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని.. నేరుగా తమకు ఆ సమాచారం ఇచ్చినా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపింది. హైడ్రా ఉద్యోగులు విచారణ చేపడితే.. పూర్తి వివరాలు అందజేస్తారని.. ఒక వేళ హైడ్రా ఉద్యోగులు కూడా మోసాలకు పాల్పడి.. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తే వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే.. 8712406899 నంబరుకు ఫోను చేసి సమాచారాన్ని వాట్సాప్‌లో అందజేయడంతో పాటు.. వారి ఫొటోలు కూడా పంపించాలని కోరింది.

# హైదరాబాద్‌లో దంపతుల 'నగ్న' దందా

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమాచారం ఆధారంగా, గురువారం పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి నిందితుల నివాసంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దందా కోసం ఉపయోగిస్తున్న కెమెరా, లైవ్ లింక్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన దంపతులను పోలీసులు ప్రస్తుతం విచారిస్తున్నారు. ఈ దందా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఎంతకాలంగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారు అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు వర్గాలు తెలిపాయి.

# కాంగ్రెస్ నిర్లక్ష్యానికి నిదర్శనం జూరాల ప్రమాదం

- **ఏటా వరద వస్తుందని తెలిసినా పనులు చేపట్టలేదు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం జూరాల ప్రాజెక్టుకు శాపంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టు నిర్వహణ విషయంలో ప్రభుత్వం చేతులెత్తేయడంతో తొమ్మిదో నంబర్ గేట్ రోప్ తెగిపోయిందని గురువారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. ఒక్క ఇటుక కూడా పేర్చడంరాని ముఖ్యమంత్రి.. నిర్వహణ విషయంలోనూ విఫలం కావడంతో ప్రాజెక్టే ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏటా భారీగా వరద వస్తుందని తెలిసినా, స్పిల్‌వే వద్ద నిర్వహణ పనులు చేపట్టడంలో అలక్ష్యం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మొద్దునీద్ర వీడి, కండ్లు తెరిచి దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని డిమాండ్ చేశారు. ఎగువ నుంచి వచ్చే వరదను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే రేవంత్ సర్కారు అసమర్థతతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది మృతి చెందారని, పెద్దవాగుకు గండిపడి 16 గ్రామాలు ముంపునకు గురయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. వట్టెం పంప్‌హౌస్ మునిగిపోయి, సుంకిశాల కుప్పకూలి రూ.వందల కోట్ల ప్రజాధనానికి గండిపడ్డదని, ఇప్పుడు జూరాల నిర్వహణలోనూ సర్కారు పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# 29న అమిత్ షా చేతుల మీదుగా పసుపు బోర్డు ఓపెనింగ్

- **కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

బలగం టీవి, హైదరాబాద్



కేంద్ర హోంమంత్రి అమిత్ షా 29 తేదీన నిజామాబాద్‌కు రానున్నారని, ఆయన చేతుల మీదుగా పసుపు బోర్డును గ్రాండ్ గా ఓపెనింగ్ చేస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ పసుపు రైతుల ఆకాంక్ష పసుపు బోర్డు కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. అనేక పార్టీలు హామీలు ఇచ్చారు. కానీ ఎంపీ అరవింద్ కృషి, ప్రధాని మోదీ ఆశీస్సులతో పసుపు బోర్డు ఏర్పాటు చేశారన్నారు. పసుపు బోర్డుకు సంబంధించి కార్యక్రమాలకు కేంద్రంగా నిజామాబాద్ ను ఎంపిక చేయడం గొప్ప నిర్ణయమన్నారు.

పసుపు ఎక్కువ ఉత్పతి చేసే ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లో బోర్డు ఏర్పాటు కోసం అడిగారని, కానీ ప్రధాని మాత్రం నిజామాబాద్ లోనే ఏర్పాటు చేస్తామని ప్రకటించడం జిల్లా వాసులకు గొప్ప బహుమతి అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రైతు బిడ్డను బోర్డు చైర్మన్ ను చేయడం గొప్ప నిర్ణయం. జాతీయ పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రెండు రోజుల్లో కార్యరూపం దాల్చనుందని, ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. నిజామాబాద్ రైతు ఉద్యమాలకు కేంద్ర బిందువు.. చైతన్యానికి ప్రతీక అన్నారు. రైతు సమస్యల మీద పోరాటం గొప్పదన్నారు. రైతులతో నిజామాబాద్ పట్టణం 29న మమేకం కానుందన్నారు. కార్యాలయం ప్రారంభం, లోగో ఆవిష్కరణ తర్వాత రైతుల సభను ఉద్దేశించి ప్రసంగం ఉంటుందన్నారు.

బీఆర్ఎస్ తో కాంగ్రెస్ కుమ్మక్కు కాలేదని భావిస్తే సీబీఐ కి ఫోన్ ట్యాపింగ్ కేసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిబిఐ చేత దర్యాప్తు చేయాలని బీజేపీ పిటిషన్ వేసిందని, సరిగా జరగని ఎడల న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు ట్యాప్ అయినట్లు చెప్పారు. వ్యాపారులు, సినిమా వాళ్లు, మీడియా వాళ్ళను వదలకుండా అందరి ఫోన్లు ట్యాప్ అయ్యాయన్నారు. వ్యక్తి స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికి లేదన్నారు. దేశంలో ఇంతటి దారుణం మరొకటి లేదన్నారు. ఎంపీ అరవింద్, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్'

(మొదటి పేజీ తరువాయి)

హబ్‌గా మార్చడానికి దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోని యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నాం. ప్రపంచంతో పోటీ పడే శక్తి, యుక్తి దేశంలో ఉంది. తెలంగాణలోని 1కోటి 50 లక్షల ఎకరాల్లో ఒక్క గంజాయి మొక్క మొలవొద్దు. ఒక్క గంజాయి మొక్క మొలిచినా ఈగల్ (గద్ద) ఇట్టే పట్టేస్తుంది. ఈ గద్ద ఈరోజు నుంచే పనిచేస్తుంది" అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , కొండా విశ్వేశ్వరరెడ్డి, సినీనటులు రాంచరణ్, విజయ్ దేవరకొండ, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు , హోం సెక్రెటరీ రవి గుప్తా, డీజీపీ జితేందర్, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యాతో పాటు అధికారులు, యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో సహా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ మాదక ద్రవ్యాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

**పిల్లలకు చాక్లెట్లు కొనివ్వాలంటే భయపడే పరిస్థితి: రామ్ చరణ్**

డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించడం గొప్ప విషయమని మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అన్నారు. డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణాపై అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం 2025 సందర్భంగా గురువారం నగరంలోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హీరోలు రామ్ చరణ్, విజయ్ దేవరకొండ, దిల్ రాజు, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ.. ప్రజెంట్ జనరేషన్ లో పిల్లలకు చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు కొనివ్వాలంటే భయపడే పరిస్థితి ఉందని అన్నారు. ఒక తండ్రిగా రాష్ట్రం గురించి, సిటీ గురించి, స్కూల్స్ గురించి ఆలోచించాల్సి వస్తుందని.. రేపు మా పిల్లలను బయటకు పంపించాలంటే ఇవన్నీ ఆలోచించాల్సి ఉంటదని చెప్పారు. వ్యవస్థలోని చెత్తను శుభ్రం చేసేందుకు ప్రభుత్వానికి అందరూ సహకరించాలని రామ్ చరణ్ అన్నారు. ఇక విజయ మాట్లాడుతూ..డ్రగ్స్ విషయంలో యువత చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలన్నారు. హెల్త్, మనీ, సక్సెస్, రెస్పెక్ట్ ఇవి మనిషికి చాలా ముఖ్యమని.. డ్రగ్స్ తీసుకోవడం వల్ల మనిషికి ఇవన్నీ దూరమవుతాయని చెప్పారు.

# రూ.180.38 కోట్ల పెండింగ్ మెడికల్ బిల్లులు మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

గ్రేడ్‌లుగా విభజించడంలో చర్యలు జరుగుతున్నాయి. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం సమగ్ర ఆరోగ్య బీమా పథకం రూపకల్పన కొనసాగుతోంది. వివిధ స్థాయిలలో విభాగ ప్రమోషన్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రమోషన్ ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు. రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని 7.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

జూన్ 13న ప్రభుత్వం రెండు డీఏల పెంపును ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత మెడికల్ బిల్లుల చెల్లింపును కూడా భట్టి విక్రమార్క పూర్తి చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటైన మంత్రుల ఉపసమితి చైర్మన్‌గా భట్టి విక్రమార్క కేవలం 15 రోజుల్లోనే అనేక సమస్యలను పరిష్కరించడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు గత 27 నెలలుగా మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎంప్లాయిస్ వెల్ఫేర్ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వెళ్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రభుత్వం ఒక ఆదర్శ కుటుంబంగా భావించి వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

# రేవంత్ తరువాత నేనే ముఖ్యమంత్రిని అవ్వడానికి ప్రయత్నిస్తా

- **టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



బలగం టీవి, హైదరాబాద్

రేవంత్ తరువాత తానే ముఖ్యమంత్రి అవ్వడానికి ప్రయత్నం చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మూడేళ్లు రేవంత్‌రెడ్డే సిఎంగా ఉంటారని, వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని ఆయన అన్నారు. ఆ క్రమంలోనే తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని ఆయన చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కెసిఆర్ ఆయన కుటుంబ సభ్యులు, ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ అంతా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల ఫోన్లను ట్యాపింగ్ చేయడమే పనిగా పెట్టుకుందని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం కొంత మందిని టార్గెట్ గా పెట్టుకొని ఫోన్ ట్యాపింగ్ చేస్తూ దుర్మార్గం, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన దుయ్యబట్టారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు, కవితలు రాత్రి పూట ఫోన్ల వద్ద పడుకునే వారేమోనని ఆయన ఎద్దేవా చేశారు. నేరస్తుల ఫోన్లు ట్యాప్ చేయడం వేరని, కానీ, ప్రజాస్వామ్య పరిధిలో రాజకీయ వ్యవహారాలు చేసే లీడర్ల ఫోన్లు ట్యాప్ చేయడం ఏమిటనీ ఆయన మండిపడ్డారు. తన ఫోన్ ట్యాప్ అవుతున్నట్లు గతంలో చాలా మంది పోలీసు అధికారులు తనతో చెప్పారని, నా ఫోన్ ట్యాప్ చేసి ఏం చేస్తారని వారితో చెప్పానని జగ్గారెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది మినహా మిగతా ఎనిమిదేళ్లు కెసిఆర్ ఇదే పనిమీద ఉన్నారని ఇతరుల రహస్యాలను వినడమే వారు పనిగా పెట్టుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



## గోశాల నూతన సిబ్బందికి నియామక పత్రాల అందజేత

**-నేటి నుంచి విధుల్లోకి రావాలని ఆదేశం**

**-జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి సంబంధించిన గోశాలలో పనిచేయుట కోసం నియమించిన సిబ్బందికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 40 మందికి గాను ఈ రోజు 38 మంది సిబ్బందికి గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. వారిని శుక్రవారం (నేటి) నుంచి విధులకు హాజరు కావాలని సూచించారు. వేములవాడ పరిధిలోని హన్మక్కపల్లిలో 25 ఎకరాలు, మర్రిపల్లిలో 40 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయించారు. దానిలో కోడెల కోసం పచ్చిగడ్డి పెంచాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించగా.జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్లతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గురువారం హన్మక్కపల్లి, మర్రిపల్లిలో కేటాయించిన స్థలాలను పరిశీలించారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన డాక్టర్ చెన్నాడి రవీందర్రావు ఇటీవల మరణించినారు.వారి కుటుంబ సభ్యులను గురువారం రోజున నాప్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్రావు, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు తీపిరెడ్డి కిషన్ రెడ్డి, వెంకట్రామారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, డైరెక్టర్లు హనుమండ్లు తదితరులు పరామర్శించినారు.

## నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

**-ఇద్దరు మహిళా మావోలు మృతి**

**బలగం టీవీ, రాయ్‌పూర్**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోలు దుర్మరణం చెందారు. మావోయిస్టుల మాడ్ డివిజన్ సీనియర్ కేడర్ అబూజ్‌మడ్ అడవుల్లో సంచరిస్తున్నారని సమాచారం రావడంతో డిఆర్‌జి, స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. మావోయిస్టులు తారసపడగానే లొంగిపోమ్మని పోలీసులు కోరారు. మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి మందుగుండు సామాగ్రి, ఇన్సాస్ రైఫిల్, ఆయుధాలను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. మిగిలిన మావోల కోసం గాలింపు చర్యలు చేపట్టామని భద్రతా బలగాలు వెల్లడించాయి.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణ బాధ్యత మంత్రి సీతక్క తీసుకోవాలి

**-మావోయిస్టు నేత జగన్**

**బలగం టీవీ, ములుగు**

ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక లేఖలో పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అధికారులు, పోలీసులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రజలను అరెస్టులు, కేసుల బెదిరింపులతో గూడేలను ఖాళీ చేయించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ బిడ్డ, మాజీ నక్సలైట్‌గా ప్రాచుర్యంలో ఉన్న సీతక్క సొంత నియోజకవర్గంలో ఈ విధంగా జరగడం సిగ్గుచేటు, అవమానకరమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ధనసరి అనసూయ ఎందుకు ఆదివాసీల గురించి మాట్లాడడం లేదనేది అందరూ మాట్లాడుకుంటున్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌పై, 1996లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన పీసా చట్టంపై, 2006లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఎఫ్ఆర్ఏ, 1/70 చట్టాన్ని సీతక్క మరచిపోయిందా.. అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఆదివాసీలు, భారత రాజ్యాంగం గురించి పదే పదే మాట్లాడుతున్నది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు అర్థం కావడం లేదా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి..ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

**-భవిష్యత్తు తరాల కోసం డ్రగ్స్ రహిత సమాజం నిర్మించడమే అందరి లక్ష్యం.**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి పక్కా ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని, డ్రగ్స్ ను వినియోగించి సమాజానికి ఇబ్బంది కలిగించే పౌరులుగా మారవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు. గురువారం యాంటీ డ్రగ్ డే సందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, విద్యార్థులు, పోలీస్ అధికారులతో కలిసి గురువారం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ నుంచి పద్మనాయక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ తీశారు.

ప్రజలను ఆకట్టుకుంటూ ఆలోచింపచేసేలా ఉన్న గంజాయి రహిత సమాజం-మనందరిబాధ్యత- డ్రగ్స్‌కి నో చెప్పండి - ఆరోగ్యమే అసలైన సంపద వంటి ప్లకార్డ్స్, నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో మెదడు, కిడ్నీలు, ఊపిరి తిత్తులు దెబ్బతింటాయని రాను రాను ఆరోగ్యం క్షీణిస్తుందని అన్నారు. డ్రగ్స్ వినియోగంతో శారీరకంగానే కాకుండా మానసిక ఇబ్బందులు, సామాజిక రుగ్మతలు తలెత్తుతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన ఉండి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఉత్తమ సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా.. విక్రయించినా.. తరలించనా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత సమాజంతో మన రాష్ట్రం అలాగే దేశం ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు యువత డ్రగ్స్ కు దూరంగా ఉంటూ యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారాలని అన్నారు. అనంతరం యాంటీ డ్రగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన ఇతర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలను కలెక్టర్, ఎస్పి తదితరులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులు అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో వివిధ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు. విద్యార్థులు గీసిన చిత్రాలు.. తయారు చేసిన పెయింటింగ్ లను చూసి కలెక్టర్, ఎస్పీ వారిని అభినందించారు. అలాగే యాంటీ డ్రగ్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పై కలెక్టర్, ఎస్పీ, అధికారులు సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సి.ఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, నతేష్,మధుకర్, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదవడం పై నిత్యం ప్రాక్టీస్ చేయించాలి..




**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

విద్యార్థులతో చదవడం పై నిత్యం ప్రాక్టీస్ చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం తంగళ్ళపల్లి మండలం మండెపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.అంగన్వాడీలో చిన్నారులకు సంబంధించిన అన్ని వివరాల రిజిస్టర్ లు సక్రమంగా నిర్వహిస్తూ, పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.పాఠ్య పుస్తకాలను చదివించి, విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న తీరును , వంటకాలని పరిశీలించారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్రం బోధించి, ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ మీద వంట తయారు చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలని అన్నారు. పాఠశాలలోనే కాకుండా ఇంటి వద్ద కూడా చదవడం ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులతో పేర్కొన్నారు. చదవడం, రాయడం పై ప్రత్యేకంగా దృష్టి సారించి, విద్యార్థులకు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా మెరుగైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానికి అనుగుణంగా చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాలయం ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భార్యను చంపిన భర్త

**బలగం టీవీ, ఆదిలాబాద్**

దంపతులు మధ్య గొడవ జరగడంతో భార్య గొంతు నులిమి భర్త చంపిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దరిబితండాలో నటరాజ్, సుజాత(21) అనే దంపతులు నివసిస్తున్నారు. భార్య భర్తల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి భార్య, భర్త మధ్య గొడవ తారా స్థాయికి చేరుకోవడంతో ఆమె గొంతు నులిమి భర్త చంపేశాడు. అనంతరం అతడు పారిపోయాడు. దీంతో మృతురాలి జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. అడ్డు వచ్చిన పోలీసులపై దాడికి దిగడంతో ఎస్పి కాజల్ సింగ్ తన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి బంధువులతో మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని కాజల్ సింగ్ తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉత్తరాఖండ్‌లో నదిలో పడిన బస్సు.. ఇద్దరు మృతి

**బద్రీనాథ్ యాత్రలో విషాదం**

**బలగం టీవీ, రుద్రప్రయాగ్**



ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై ఘోర రోడ్ ప్రమాదం చోటు చేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న ఓ బస్సు గోల్‌తిర్ గ్రామం వద్ద అలకనంద నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యాత్రికులు మృతిచెందారు. మరో 8 మంది గాయపడ్డారు. ఇంకా 10 మంది యాత్రికుల ఆచూకీ తెలియకుండా పోయింది. రుద్రప్రయాగ్ నుంచి గౌచార్ వెళ్తున్న టెంపో ట్రావెలర్ వాహనం ఈ ఘటనకు గురైనట్టు పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలానికి సహాయ, రక్షణ బృందాలు చేరుకొని మృతదేహాల వెలికితీత చేపట్టాయి. నదిలో రెండు మృతదేహాలను బయటకు తీశారు. ఒక మృతదేహాన్ని రుద్రప్రయాగ్ సమీపంలో గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. గాయపడినవారిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నట్టు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి సత్యేంద్ర సింగ్ భండారి చెప్పారు. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్‌తో పాటు 20 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిసింది. ఉదయం 7.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఆ బస్సులోని యాత్రికులు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ నుంచి చార్‌ధాం యాత్రకు బయలుదేరినవారు అని సమాచారం.

# టెస్టుల్లో స్లో ఓవర్ రేటుకు చెక్

## కొత్త సీజన్ నుంచే స్టాప్ క్లాక్ అమలు




- **డబ్ల్యూటీసీ 2025-27 సీజన్ నుంచి కొత్త నిబంధనల అమలు**
- **ఓవర్ గ్యాప్‌కు ఐదు పరుగుల జరిమానా**
- **లాలాజలం నిషేధం అలాగే కొనసాగింపు**
- **కేవలం బంతి పూర్తిగా దెబ్బతిన్నప్పుడు మాత్రమే మార్పు**
- **డీఆర్ఎస్‌లో ఎల్బీ నిర్ణయాలకు కొత్త విధానం**

**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రికెట్ లో పలు కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే వన్డేల్లో బౌండరీ క్యాచ్ నిబంధనలను మార్చిన ఐసీసీ.. ఇప్పుడు టెస్టుల్లో స్లో ఓవర్ రేటుపై కఠిన నిర్ణయం తీసుకుంది. డబ్ల్యూటీసీ (2025-27) సీజన్ నుంచి టెస్టుల్లో స్టాప్ క్లాక్ విధానం అమలు చేయనున్నట్లు ఐసీసీ గురువారం ప్రకటించింది.

**ఓవర్ గ్యాప్‌కు పెనాల్టీ**

ప్రతి ఓవర్ పూర్తయిన తర్వాత ఒక నిమిషంలోనే కొత్త ఓవర్ ప్రారంభం కావాలి. ఇలా జరగని పరిస్థితిలో బౌలింగ్ జట్టు కెప్టెన్‌కు మొదట రెండు హెచ్చరికలు అందిస్తారు. మూడోసారి అదే తప్పు పునరావృతమైతే ఆ జట్టుకు ఐదు పరుగులు పెనాల్టీ విధిస్తారు. 80 ఓవర్ల వరకు ఇదే విధానం కొనసాగుతుంది. షార్ట్ రన్ తర్వాత క్రీజులో ఎవరు ఉండాలో బ్యాటింగ్ జట్టే నిర్ణయించుకునే హక్కు పొందుతుంది.

**లాలాజలంపై నిషేధం కొనసాగింపు**

మ్యాచ్ సమయంలో బంతికి లాలాజలం రుద్దడంపై నిషేధం కొనసాగుతుంది. బంతిపై సలైవా కనపడితే వెంటనే బాల్ మార్చకూడదని అంపైర్లకు సూచించింది. ఎందుకంటే, కొత్త బంతి కోసం జట్లు ఉద్దేశపూర్వకంగా లాలాజలం వాడే అవకాశముందని ఐసీసీ భావిస్తోంది. పూర్తిగా దెబ్బతిన్నప్పుడు మాత్రమే బంతిని మార్చే సూత్రం కొనసాగుతుంది.

**డీఆర్ఎస్‌లో కొత్త మార్పు**

డీఆర్ఎస్ లో కూడా మార్పు జరిగింది. వికెట్ కీపర్ క్యాచ్ ఇచ్చి ఔటైనట్లు అనిపించిన సందర్భంలో రివ్యూ తీసుకుంటే, అది క్యాచ్ కాదు అని తేలితే టీవీ అంపైర్ ఎల్బీని చెక్ చేస్తాడు. బాల్ ట్రాకింగ్ లో ఎల్బీగా కనిపిస్తే ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇచ్చే నిర్ణయం అమలవుతుంది. అంపైర్ కాల్ అని వచ్చినా బ్యాటర్ డగౌట్‌కు వెళ్లాల్సిందే.

# రెండో టెస్టుకు ఇంగ్లండ్ స్క్వాడ్ ప్రకటన

**బలగం టీవీ, హైదరాబాద్**




ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ జులై 2వ తేదీన మొదలుకానుంది. ఆ మ్యాచ్‌కు ఇంకా 6 రోజుల సమయం ఉంది. కానీ ఈ పోరు కోసం 15 మందితో కూడిన స్క్వాడ్‌ను తాజాగా ప్రకటించింది ఇంగ్లండ్. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను కొత్తగా టీమ్‌లోకి తీసుకుంది ఆతిథ్య జట్టు. లీడ్స్ టెస్ట్‌లో ఆడిన కెప్టెన్ బెన్‌స్టోక్స్, జో రూట్, బెన్ డకెట్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, జాక్ క్రాలే, ఓలీ పోప్, జేమీ స్మిత్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్ స్క్వాడ్‌లో ఉన్నారు. వీళ్లతో పాటు బేతెల్, సామ్ కుక్, జేమీ ఓవర్టన్ కూడా జట్టులో ఉన్నారు. అయితే వీళ్లలో ఎవరెవర్ని ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకుంటారో చూడాలి. ముఖ్యంగా చాన్నాళ్ల తర్వాత కమ్‌బ్యాక్ ఇస్తున్న ఆర్చర్‌ను బరిలోకి దించుతారా? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది.

తొలి టెస్టులో టీమిండియాపై రికార్డు ఛేదనతో విజయం సాధించిన ఇంగ్లండ్ రెట్టించిన ఉత్సాహంలో ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో విక్టరీతో సిరీస్‌లో తమ ఆధిక్యాన్ని పెంచుకోవాలని భావిస్తోంది స్టోక్స్ సేన. దాంతో, గురువారం ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు 15 మందితో కూడిన తుది స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. ఇందులో 2019 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆర్చర్‌కు చోటు లభించింది. ఈమధ్యే సస్సెక్స్ తరఫున ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన ఈ పేస్ గన్.. ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టాడు. దాంతో, జూలై 2న మొదలయ్యే హెడ్జ్‌బాస్టన్ టెస్టు కోసం అతడిని స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. 2021 ఫిబ్రవరిలో చివరిసారిగా టెస్టు జెర్సీ వేసుకున్న ఆర్చర్.. పునరాగమనంలో భారత బ్యాటర్లను ఇరుకున పెట్టేందుకు సిద్ధమవుతున్నాడు.

**రెండో టెస్టుకు ఇంగ్లండ్ స్క్వాడ్ : బెన్ స్టోక్స్(కెప్టెన్), జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్ జో రూట్, జాకబ్ బెథెల్, హ్యేరీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, జేమీ ఓవర్టన్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్సే, జోష్ టంగ్, సామ్ కుక్, షోయబ్ బషీర్.**




## కూలీ నుంచి 'చికిటు' పాట విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ' . లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాలో అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా.. మొదటి పాట 'చికిటు' పాటను విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటలో రజనీకాంత్‌తో పాటు అనిరుధ్, టి. రాజేందర్ కూడా డ్యాన్స్‌తో అలరించారు.




## 'సన్ ఆఫ్ సర్దార్ 2' గ్లింప్స్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సన్ ఆఫ్ సర్దార్ 2. విజయ్ కుమార్ అరోరా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాల్ థాకుర్ కథానాయికగా నటించబోతుంది. దిగ్గజ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో సునీల్ హీరోగా వచ్చిన మర్యాద రామన్న సినిమాను హిందీలో సన్ ఆఫ్ సర్దార్ అని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే సినిమాకు సన్ ఆఫ్ సర్దార్ 2 అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు మేకర్స్. ఇప్పటికే ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా విడుదల తేదీతో పాటు టీజర్‌ను పంచుకుంది. ఈ సినిమాను జూలై 25న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## డ్రగ్స్ కేసులో మరో తమిళ నటుడు అరెస్ట్..

**బలగం టీవీ, హైదరాబాద్**



డ్రగ్స్ కేసులో మరో తమిళ నటుడు అరెస్ట్ అయ్యాడు. మూడు రోజుల క్రితం నటుడు శ్రీకాంత్ ను చెన్నైలో పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. శ్రీకాంత్ ను అదుపులోకి తీసుకున్న తర్వాత జ్యుడీషియల్ కస్టడీ విధించారు. విచారణలో కీలక సమాచారం సేకరించిన పోలీసులు.. నటుడు కృష్ణను కూడా గురువారం చెన్నైలో అరెస్టు చేశారు. ఇద్దరు నటులు అరెస్టుతో చెన్నై కొకైన్ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.




## 3 బీహెచ్‌కే ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు సిద్ధార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 3 బీహెచ్‌కే. ఈ సినిమాకు శ్రీ గణేష్ దర్శకత్వం వహిస్తుండగా.. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా రాబోతుండగా.. అరుణ్ విశ్వ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒక మధ్యతరగతి కుటుంబం సొంత ఇల్లు కొనడానికి పడే పాట్లను, వారి కలలను ఆవిష్కరించే భావోద్వేగభరితమైన కుటుంబ డ్రామాగా రాబోతుందని తెలుస్తుంది. ఆసక్తికరంగా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.



## కన్నప్ప టికెట్లు హాట్ కేకుల్లా...

- **24 గంటల్లో 1.15 లక్షల టికెట్లు అమ్ముడు**
- **సోషల్ మీడియాలో వెల్లడించిన మంచు విష్ణు**

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. నేడు థియేటర్లకు రానున్న ఈ చిత్రం టికెట్లు భారీగా అమ్ముడవుతున్నాయి. కేవలం 24 గంటల్లోనే 1,15,000 టికెట్లు అమ్ముడయ్యాయని మంచు విష్ణు స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని, ఉద్వేగాన్ని వ్యక్తం చేశారు. "ప్రేక్షకుల స్పందన చూసి హృదయం పరవళ్లు తొక్కుతోంది. నా మనసు ఉద్వేగంతో నిండిపోయింది. ఈ సినిమా విడుదలకు ముందే ఇంతటి ఆదరణ, ప్రేమ లభించడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అచంచలమైన మద్దతు అందిస్తున్న ప్రతి సినీ ప్రేమికుడికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు," అని విష్ణు తెలిపారు.

**పరమేశ్వరుడికి ఘనత**

"ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు. ఇది పరమేశ్వరుడికి, కన్నప్పకు చెందిన ఘనత. ఈ విజయం అంతా వారికే అంకితం," అని విష్ణు పేర్కొన్నారు. చివరగా హరహరమహాదేవ్ అంటూ తన భక్తిని చాటుకున్నారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

### పవన్ కల్యాణ్ కోసం ప్రత్యేక ప్రదర్శన

'కన్నప్ప' నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదల సందర్భంగా చిత్ర బృందం గురువారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మంచు విష్ణు సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. దర్శకుడు ముకేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, ఇలాంటి గొప్ప చిత్రాన్ని రూపొందించడం సంతోషంగా ఉందని, చిత్ర బృందం మొత్తం అంకితభావంతో పని చేసిందని తెలిపారు. సినిమా విడుదలైన తర్వాత పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా కలిసి, ఆయనకు కన్నప్ప సినిమా చూపిస్తానని విష్ణు తెలిపారు. "మనకు తెలిసిన పవన్ కల్యాణ్ వేరు. ఇప్పుడు ఆయనపై రాష్ట్ర బాధ్యత ఉంది. నటుడిగా ఆయన నాకు సీనియర్. ఆయన ప్రశంసల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరలు పెంచినప్పటికీ, తెలంగాణలో మాత్రం ధరలు పెంచడం లేదని స్పష్టం చేశారు. "ఎప్పుడైతే థియేటర్లలో పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్ ధరలు తగ్గుతాయో, అప్పుడే మల్టీప్లెక్సుల్లో ధరల పెంపు గురించి ఆలోచిస్తాను. ఇది కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా కాబట్టి, ధరలు పెంచి ప్రేక్షకులను ఇబ్బంది పెట్టదలచుకోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్ని కేంద్రాల్లో మాత్రమే రూ.50 పెంచాలని విజ్ఞప్తి చేశాం" అని ఆయన అన్నారు.సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ప్రభాస్ ఎందుకు హాజరుకాలేదన్న ప్రశ్నకు, "ప్రభాస్ చాలా మొహమాటస్తుడు. ఈ చిత్రంలో భాగమైనందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఆయన మనస్తత్వం నాకు తెలుసు, కాబట్టి ఆయన్ని ఇబ్బంది పెట్టాలని అనుకోలేదు. సినిమాకు ఒక వీడియో బైట్ పంపిస్తానని చెప్పారు, కానీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు. ఆయన వల్లే ఈ చిత్రాన్ని ఇంత భారీ స్థాయిలో విడుదల చేయగలుగుతున్నాం. ఇందులో ప్రభాస్ పాత్ర సుమారు 40 నిమిషాల పాటు ఉంటుంది" అని విష్ణు తెలిపారు.